శిశుగృహ కేంద్రం సిబ్బందికి నోటీసులు 8

సచివాలయంలో వైసీపీ నాయకుడి బర్త్‌డే

మద్యం మత్తులో అల్లరి.. జైలుకు యువకులు



ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రమోషన్లపై హర్షం

- సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించడంపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పుట్టపర్తిలోని పల్లె క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే, మాజీమంత్రి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై పంచాయతీ కార్యదర్శులు తక్షణమే స్పందిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటనారాయణ, ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అలరించిన భక్తి పాటలు

పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన శివం భక్తులు పాడిన భక్తిపాటలు భక్తులను కట్టిపడేశాయి. గంటపాటు మధుర గానంతో అలరింపజేశారు. శివం సేవాసంస్థల ఆధ్వర్యంలో ఉపకరణాలు, స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ కుట్టుమిషన్లు, దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం సత్యసాయిని మహాసమాధిని దర్శించుకున్నారు.



దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ పంపిణీ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

కలం.. కావాలి జనహితం

- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

8

బతుకు పోగు..!

అతివల ఆర్థిక శక్తి.. గార్మెంట్స్

- జిల్లాలో వేల మందికి ఉపాధి
- మారుతున్న కుటుంబ ఆర్థిక చిత్రం
- నియోజకవర్గానికొకటి ఏర్పాటు దిశగా టీడీపీ ప్రభుత్వం సమాలోచనలు
- అమలు చేస్తే.. ఆర్థిక వెలుగులే..

కరువుతో సేద్యం డీలా పడింది. రైతులు కూలి పనులకు వెళ్లసాగారు. అవి కూడా దొరకడం గగనమైంది. ఇల్లు గడవడం భారంగా మారింది. పిల్లలను, ఊరిని వదిలి వలసబాట పట్టారు. పరాయి పంచన ఎన్నో కష్టాలు పడ్డారు. అయినా.. కడుపు నిండేది కాదు. ఆ పరిస్థితుల్లో గార్మెంట్స్ జిల్లాకు వచ్చాయి. వేల మంది మహిళలకు ఉపాధి చూపాయి. కూలి కూడా దొరకని పరిస్థితుల్లో వేలల్లో వేతనాలు ఇవ్వసాగాయి. ఎన్నో కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపాయి. వేలాది కుటుంబాల ఆర్థిక చిత్రం మారిపోయింది. టీడీపీ హయాంలో ప్రతి నియోజకవర్గంలో గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావించారు. ఆ దిశగా మంత్రుల బృందం పరిశీలించింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో గార్మెంట్స్ ఆశలు అడియాసలయ్యాయి. కూటమి ప్రభుత్వం గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్రహిస్తే వేలాది కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాలని అనంతవాసులు కోరుతున్నారు.

పరిగిలోని గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న వందలాది మంది మహిళలు



పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గార్మెంట్స్ అంటే పదేళ్ల కిందట బెంగళూరు, దొడ్డబాళ్లాపురం గుర్తుకొచ్చేవి. అప్పట్లో జిల్లా నుంచి గార్మెంట్స్‌లో పని చేసేందుకు వేలాది మంది వలస వెళ్లేవారు. బెంగళూరు, దొడ్డబళ్లాపురం, రాజన్నకుంట, యలహంక తదితర ప్రాంతాల్లో అనంత జిల్లావాసులే ఎక్కువగా పనిచేసేవారు. జిల్లాలో కార్మికులు అధికంగా దొరుకుతుండడంతో పదేళ్ల కిందట హిందూపురం ప్రాంతంలోని తూమకుంట పారిశ్రామిక వాడలోకి గార్మెంట్స్ పరిశ్రమలు అడుగు పెట్టాయి. ఆ తరువాత హిందూపురం, పరిగి, చిలమత్తూరు, గోరంట్ల, మడకశిర ప్రాంతాల్లో 15 పరిశ్రమలదాకా ఏర్పాటయ్యాయి. గార్మెంట్స్ పరిశ్రమల్లో హెల్పర్ నుంచి టైలర్ నైపుణ్యతను బట్టీ నెలకు రూ.9వేల నుంచి రూ.30వేలదాకా వేతనం ఇస్తున్నారు. ఇలా జిల్లాలో 20 వేల మందికి పైగా మహిళలకు ఉపాధి లభిస్తోంది. దీంతో కొత్త పరిశ్రమ వస్తోందంటే చాలు.. కార్మికులు క్యూ కడుతున్నారు. గార్మెంట్స్‌లో కుట్టు శిక్షణ కేంద్రాలు భారీగా వెలుస్తున్నాయి. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర్లోనే ఉండడం **(మిగతా 10లో..)**

రూపిక సూపర్

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో విజేతగా ఆవిర్భావం



విజేతలతో విద్యాశాఖ అధికారులు

కొత్తచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో లేపాక్షి మండలం సిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రూపిక విజేతగా నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోటీలు నిర్వహించారు. 21 మండలాల నుంచి 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రూపిక మొదటి స్థానం కైవసం చేసుకుంది. ధర్మవరంలోని శాంతినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన గణేశ్ ద్వితీయ, ఓడీసీ విద్యార్థి ఇలియాస్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. శనివారం విజయవాడలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రసంశాపత్రాలు, పతకాలను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన డీఈఓ కిష్టప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జాన్‌రెడ్డప్ప, ప్రధానోపాధ్యాయులు గోపాల్, నూర్జహాన్, గైడ్ టీచర్లు నటరాజ్, ప్రదీప్, జూరీ సభ్యులు మహేంద్రరెడ్డి, శ్రావణి, నాగరాజు, వర్మ, జగదీశ్, సురేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వందేభారత్‌కు పురంలో స్టాపింగ్

- రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న

10

సరిహద్దులో హత్యల అలజడి..!

మత్తులోనే దారుణాలు

కల్లు, మద్యం షాపుల వద్ద గొడవలే కారణం


పోలీసుల్లో ఆందోళన.. ప్రజల్లో భయం

ఈ ఏడాది జూన్26న కర్ణాటక సరిహద్దులోని మద్యం షాపు వద్ద హిందూపురానికి చెందిన రవికుమార్ మద్యం సేవించడానికి వెళ్లాడు. అక్కడ కర్ణాటకలోని గౌరీబిదునూరుకు చెందిన వ్యక్తి గొడవపడి డబ్బులు అడిగాడు. రవికుమార్ వద్ద లేకపోవడంతో కత్తితో పొడిచి చంపేశాడు.

నాలుగు రోజుల క్రితం సంతేబిదునూరువద్ద కల్లు తాగడానికి గౌరీబిదునూరుకు చెందిన పవన్ కుమార్ వచ్చాడు. కల్లుతాగి వెళ్లే సమయంలో అదే ప్రాంతానికి చెందిన యువకులు డబ్బు కోసం వాహనం ఆపి గొడవపడ్డారు. అతడి వద్ద చైన్ లాక్కుని, వాహనం కూడా లాక్కుని, హత్య చేశారు.

ఈనెల 13న వంకాయల గేటు వద్ద మద్యం సేవించడానికి హిందూపురంలోని సూగూరుకు చెందిన యువకులు వెళ్లారు. మద్యం మత్తులో గొడవపడి పవన్ కల్యాణ్ అనే యువకుడిని క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హత్యచేశారు.

నాలుగు రోజుల క్రితం సంతేబిదునూరు వద్ద కర్ణాటకకు చెందిన యువకుడిని కల్లుదుకాణం వద్ద హత్య చేశారు. ఈ ఘటన వెలుగు చూసిన 24 గంటల్లోపే పవన్ కల్యాణ్‌ను చంపేశారు. హత్యలకు కారణాలు ఏవైనా ఆ సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నారని పోలీసుల విచారణలో వెల్లడవుతోంది.





ఈనెల 13న సంతేబిదునూరు వద్ద హత్య జరిగిన ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఐ జనార్దన్

హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులో వరుస హత్యలు అలజడి రేపుతున్నాయి. ప్రజలు, పోలీసు వర్గాల్లో ఆందోళన మొదలైంది. హత్యల్లో ప్రమేయం ఉన్నవారిని పోలీసులు గుర్తించి, వారిపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. అయినా హత్యలు ఆగకపోవడం పోలీసు శాఖను అయోమయంలో పడేస్తోంది.

మత్తు కోసమే..

కర్ణాటక మద్యం షాపుల్లో టెట్రాప్యాకెట్లమద్యం తక్కువ ధరకు లభిస్తుంది. దీంతో చాలామంది జిల్లావాసులు కర్ణాటకలోని మద్యం షాపులకు వెళ్తున్నారు. అక్కడ తాగి, ఆ మత్తులో గొడవలు పడుతున్నారు. అవి హత్యలకు దారితీస్తున్నాయి. కర్ణాటకలో కల్లు దొరకదు. దీంతో ఆ ప్రాంతం నుంచి కల్లు తాగేందుకు జిల్లా సరిహద్దులోకి వస్తున్నారు. సరిహద్దులో సంతేబిదునూరు, చౌళూరు, జేవనహళ్లి వద్ద కల్లు దుకాణాలు అధికంగా ఉన్నాయి. నిత్యం వందలాది మంది కర్ణాటక నుంచి వచ్చి కల్లుతాగి వెళ్తుంటారు. కర్ణాటకవాసులు తాగిన మత్తులో గొడవలు పడి హత్యలు చేసుకుంటున్నారు. సరిహద్దుల్లో జరుగుతున్న హత్యల్లో 90శాతం మత్తులో చేస్తున్నవేనని తెలుస్తోంది. మద్యం షాపులు, కల్లు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే హత్యలను అరికట్టవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మత్తులోనే అధికంగా హత్యలు



సరిహద్దులో ఇటీవల జరుగుతున్న హత్యలను పరిశీలిస్తే మత్తులోనే చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక్కడివారు కర్ణాటకకు వెళ్లి, అక్కడివారు ఇక్కడికి వచ్చి హత్యకు గురవుతున్నారు. వెంటనే నేరస్తులను గుర్తించి, కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం.

\- మహేష్, డీఎస్పీ, హిందూపురం

సంక్షేమ హాస్టల్‌లో కలెక్టర్ నిద్ర

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం రాత్రి నిద్ర చేశారు. హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్.. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్యాసదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలసి బోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. కష్టపడి చదువుకుని ఉన్నతస్థానాలను ఆధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రికి వసతిగృహంలోనే బస చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కాటమరాజు (ఫైల్)

తాడిమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లప్పల్లి బస్టాండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాటమరాజు(33) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పిన్నదరి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు రామాంజనేయులు పెయింటర్‌గా పనిచేస్తు జీవనం సాగించేవాడు. గురువారం సాయంత్రం బత్తలపల్లి నుంచి పిన్నదరికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పుల్లప్పల్లి బస్టాండ్ వద్ద బొలెరో వాహనాన్ని ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాటమరాజును అనంతపురం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


చింతకాల బాబు (ఫైల్)

బుక్కపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో చింతకాయల బాబు(43) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు బాబు కియ పరిశ్రమలో పని చేస్తుండేవాడు. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించి బంధువులు గ్రామంలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

అనంతపురం క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు, రూ.5వేల జరిమానాను కోర్టు విధించింది. వివరాలు ఇలా.. ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు ఇంటి ముందు నిద్రిస్తుండగా మదిగుబ్బ గ్రామానికి చెందిన 50 ఏళ్ల పెద్దన్న 2018 జూలై 27న అత్యాచారం చేశాడు. దీనిపై అదే నెల 28న ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ సాగర్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శివనారాయణస్వామి దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో 11 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో పెద్దన్నకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం నాలుగో సెషన్స్ కోర్టు న్యాయాధికారి హరిత శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్‌ఐలు శ్రీనివాసులు, శౌరెడ్డి, కానిస్టేబుల్ షేక్షావలి సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చడం, నిందితులకు శిక్షపడటంలో కీలకంగా కృషి చేయడంతో జిల్లా ఎస్పీ జగదీష్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ శేఖర్


అనంతపురం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని అనంతపురం రూరల్ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ రూరల్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ మండలంలోని కొడిమి దర్గా కొట్టాలకు చెందిన వేణు కుమారుడు రామాంజనేయులు (10) ఉరవకొండలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ నాలుగో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల తర్వాత తన రెండో అన్న నరసింహతోపాటు హాస్టల్‌కు వెళ్లేందుకు బయలు దేరాడు. ఏమైందో ఏమో కానీ హాస్టల్‌కు వెళ్లను అంటూ బస్సులో ఏడవడం మొదలు పెట్టాడు. దీంతో బాలుడి పెద్దన్న ఈశ్వర్ రాచానపల్లి వద్ద దర్గా కొట్టాలకు వెళ్లే రోడ్డులో రామాంజనేయులును దించేశాడు. బాలుడు అమ్మ కొడుతుందన్న భయంతో ఇంటికి వెళ్లకుండా ఈనెల 11న రైల్వేస్టేషన్‌కు వెళ్లి, తర్వాత కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఈనెల 12 ఫిర్యాదు చేయడంలో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టారు. అనంతపురం బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వాసుపత్రి, అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. అయితే బాలుడు వజ్రకరూరు మండలం కమలపాడుకు చెందిన తలారి రామాంజనేయులు అనే వ్యక్తి ద్వారా ఆయన ఊరికి వెళ్లినట్టు గుర్తించారు. పోలీసుల బృందం అక్కడికెళ్లి బాలుడిని తీసుకొచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం బాలుడిని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.

విద్యార్థుల ఘర్షణ

● కొడుకుపై కేసు పెట్టొద్దంటూ తల్లి ఆత్మహత్యాయత్నం

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడ్డారు. ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో వాటికి కారణమైన విద్యార్థిపై కేసు నమోదు చేశారు. ఆ విద్యార్థిపై కేసు నమోదు చేయవద్దంటూ తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గురువారం రాత్రి ట్యూషన్ నుంచి ఇంటికి వస్తూ స్థానిక ఆంజనేయస్వామి వద్ద ఘర్షణ పడ్డారు. దీంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దెబ్బలు కొట్టిన విద్యార్థి తల్లి తన కొడుకుపై కేసు నమోదు చేయవద్దంటూ పోలీసులను కోరారు. అందుకు పోలీసులు ఒప్పుకోలేదు. తమ ఫిర్యాదు కూడా తీసుకోవాలని ఆమె కోరారు. ఇందుకు పోలీసులు ససేమీరా అన్నారు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్ ఆవరణలోనే చేయి కోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థులపై పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వినాయక విగ్రహం చోరీ


విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన చోట పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ అధికారి అనిల్‌కుమార్

అగళి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శంకరేశ్వర దేవాలయంలో పురాతన వినాయకుడి విగ్రహాన్ని దుండగులు గురువారం రాత్రి అపహరించారు. శుక్రవారం ఉదయం పూజల కోసం వెళ్లిన భక్తులకు వెళ్లిన భక్తులకు వినాయకుడి విగ్రహం, హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ శ్రీరాములు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీమ్ అధికారి అనిల్‌కుమార్, గుడిబండ ఎస్‌ఐ రాజకుల్లాయప్ప ఆలయంలో అణువణువు పరిశీలించారు. దేవాలయ చుట్టుపట్ల ఉన్న ప్రజల నుంచి వివరాలు ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలం.. కావాలి జనహితం..

సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న ఆలపాటి సురేష్‌కుమార్

రాయదుర్గం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు.. జనహితం కోసం కలాన్ని ఉపయోగించాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని తృప్తి గ్రాండ్‌లో ఏపీయూడబ్ల్యూజే నేతృత్వంలో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ జర్నలిస్టులకు రెండురోజుల పాటు శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విలేకరులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జర్నలిజం వృత్తిలో నిబద్ధత ఉండాలన్నారు. ప్రస్తుతం సమాజంలో విపరీతమైన వేగంతో మార్పులు వస్తున్నాయన్నారను. ఆ వేగాన్ని అందుకునేలా ముందుకు సాగాలన్నారు. దానిని అందుకోవడానికి అప్‌గ్రేడ్ కావాలన్నారు. నిబద్ధతతో నేర్చుకోవాలనే తపన ఉన్న జర్నలిస్టు వృత్తిలో రాణిస్తారన్నారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో ఆసక్తి తగ్గిపోతోందన్నారు. దీనికి ప్రధాన కారణం గౌరవం తగ్గడమేనన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. శిక్షణా తరగతుల ద్వారా ఎంతోమంది జర్నలిస్టులకు మేలు చేకూరుతోందన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, ఎస్‌ఎండీ అయూబ్, సీనియర్ జర్నలిస్టులు భోగేష్ రెడ్డి, రామకృష్ణ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వీఏఏకు నోటీసు

అనంతపురం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) నరేష్‌కుమార్‌కు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ షోకాజు నోటీసు జారీ చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడు రైతు సేవా కేంద్రంలో పనిచేసే సమయంలో 2024 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్ ఎరువుల విక్రయాలకు సంబంధించి రైతులు చెల్లించిన నాన్‌సబ్సిడీ డబ్బులు రూ.108478లను వీఏఏ నరేష్‌కుమార్ ఏపీ మార్క్‌ఫెడ్‌కు జమ చేయలేదు. ఇదివరకే వెబ్ కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్ ద్వారా బకాయి డబ్బులు చెల్లించాలని అధికారులు సూచించినా ఆ వీఏఏ పట్టించుకోలేదని షోకాజు నోటీసులో పొందుపర్చారు. శనివారం సాయంత్రం 5 గంటల్లోపు ఏపీ మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సిన సొమ్మును చెల్లించడంతోపాటు ఎందుకు చెల్లించలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరించారు. నరేష్‌కుమార్ ప్రస్తుతం కూడేరు మండలం కూడేరు -2 రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్నాడు.

రొళ్ల ఎంపీడీఓకు..

రొళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓకుపై అధికారులు షోకాజు నోటీసులు జారీచేశారు. కర్ణాటకలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో విధుల సమయంలో ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి ఉన్నారని ఎంపీపీ సీఈఓ దృష్టికి పలుమార్లు తెలిపినా పట్టించుకోకపోగా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్ శ్యామ్‌సుందర్‌కు గురువారం ఎంపీపీ కవిత ఫిర్యాదు చేశారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో రెస్టారెంట్‌లో ఉండడం ఎంపీడీఓ నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమని అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ తతంగంపై జడ్పీ సీఈఓ శివశంకర్‌ను వివరణ కోరగా శుక్రవారం ఎంపీడీఓకు నోటీసు జారీచేసినట్లు సీఈఓ తెలిపారు.

ఇద్దరికి డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్ లభించింది. ఉరవకొండ (కూడేరు ఇన్‌చార్జి) తహసీల్దార్ మహబూబ్‌బాషా, రాయదుర్గం తహసీల్దార్ నాగరాజుకు ఉద్యోగోన్నతి దక్కింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవాప్తంగా 37మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి లభించింది.

వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అనంతపురం వైద్య కళాశాలకు మరో 15 పీజీ సీట్లను మంజూరుచేస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయశ్రీ శుక్రవారం తెలిపారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ మూడు, అనస్థీషియా, గైనిక్, పీడియాట్రిక్స్ విభాగాలకు నాలుగు చొప్పున మొత్తం 15 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి తొలిసారిగా సీట్లు మంజూరు కావడం విశేషం.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 32 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పాత్రలు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సక్షమ్ అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా స్టోర్ పాత్రలు అందనున్నాయి. వీటి సరఫరాకు శుక్రవారం టెండర్లు నిర్వహించారు. 20 లీటర్ల నీటి క్యాన్, పాత్రల స్టాండ్, ఆహార ధాన్యాలు నిలువ చేసుకునేందుకు మూడురకాల క్యాన్లు, వంట పదార్థాల కొలతల పరికరాలు, డజను చొప్పున ప్లేట్లు, గ్లాసులు సరఫరా చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

అర్హులకు పథకాల వర్తింపు

● మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మత్స్యశాఖ డీడీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులతో సమావేశాన్ని నిర్వ హించారు. మత్స్యసహకార సంఘాలను నిబంధనల మేరకు నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. ఇప్పటి దాకా ఎన్నికలు నిర్వహించని సంఘాలకు ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యసహకార సంఘాల అధ్యక్షుడు నాగేష్, ఎఫ్‌డీఓ ఆసీఫ్, ఉమ్మడి జిల్లాలలోని మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఫీల్డ్ స్టాఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీఎంహెచ్‌ఎఫ్‌ఈఏ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఎన్జీఓహోమ్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్, గౌరవాధ్యక్షుడు లక్ష్మన్న ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణలో వైద్యకేంద్రాలకు, ప్రజలకు వారధిగా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వారికి దకాల్సిన అవకాశాలు, ఆర్థిక ప్రయోజనాలు గత ఆరేళ్లుగా అందకుండా పోతున్నాయని వాపోయారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న నిర్వహించే సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఈఓలు, సీహెచ్‌ఓలు హాజరుకావాలని కోరారు.

బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్

అనంతపురం వైద్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలికల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా సంపూర్ణమైన సాధికారతను సాధించవచ్చునని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, భద్రత, సమానత్వం బాలికల హక్కులన్నారు. లింగ వివక్షను రూపుమాపితే అన్ని రంగాల్లో బాలికలు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ జయలక్ష్మి, పరిపాలనాధికారి గిరిజా మనోహర్ రావు, డెమో నాగరాజు, హెచ్‌ఈఈఓ త్యాగరాజు, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ కేంద్రం సిబ్బందికి నోటీసులు

అనంతపురం వైద్యం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ శిశుగృహలోని శిశువు మృతి వ్యవహారంలో చర్యలు కొనసాగుతున్నాయి. గురువారం డీసీఎం బీఎస్ శ్రీదేవికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చార్జ్‌మెమో జారీచేసిన విషయం తెలిసిందే. శుక్రవారం శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం గుణవతి, ఆయాలు ప్రభావతి, ఆదిలక్ష్మి, సులోచన, వాచ్‌మన్‌కు ప్రభుత్వం షోకాజు నోటీసులు జారీచేసింది. విధుల నిర్వహణలో అలసత్వం, సమన్వయలోపం తదితర లోపాల కారణంగా గత నెలలో శిశువు మరణించాడన్న ఆరోపణల నేపథ్యంలో నోటీసులు జారీఅయ్యాయి. రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఆయాగా పనిచేసిన సులోచన గతనెల నుంచే విధులకు హాజరు కావడంలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మారని తీరు..

శిశుగృహ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కరించకపోవడం తదితర కారణాల నేపథ్యంలో కేంద్రంలోని ఎనిమిదిమంది ఎవరికి వారే అన్నచందంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఒకరికొకరు తరచూ గొడవలకు దిగడం, శిశువుల సంరక్షణ గాలికొదిలేయడంతో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గతనెల శిశువు మరణించాడు. దీంతో ఉన్నతాధికారులు నిత్యం శిశుగృహను సందర్శించి అక్కడి పరిస్థితులపై దిద్దుబాటుచేపట్టారు. సిబ్బందిలో మాత్రం నేటికీ మార్పు రావడంలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అది తమ పనికాదనీ, చెప్పినట్లు ఎందుకుచేయాలంటూ వితండవాదం చేస్తున్నట్లు తెలిసింది. బెదిరింపు ధోరణితో అధికారులపైనే తిరగబడుతున్నారని చర్చ సాగుతోంది.

శుభపద్రం మెగా షాపింగ్ మాల్ ప్రారంభం

● సందడి చేసిన సినీ తారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్

గుంతకల్లుటౌన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో శుక్రవారం శుభపద్రం షాపింగ్‌మాల్‌ను ప్రముఖ సినీతారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్ ప్రారంభించారు. ఉదయం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో కథాకళి వేషధారణ, పవన్ కల్యాణ్, బాలకృష్ణ వేషధారణలో ఆటపాటలతో కళాకారులు సందడి చేశారు. శుభపద్రం షాపింగ్ మాల్ ప్రారంభించడానికి ముఖ్యఅతిథులుగా సినీతారలు ఐశ్వర్య రాజేష్, రితికా నాయక్ హాజరయ్యారు. వారు రిబ్బన్ కట్ చేసి మాల్‌ను పారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం షాపులో చీరలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ తారలు మాట్లాడుతూ.. రాయలసీమలో మొట్టమొదట శుభ్రపదం షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్నిరకాల వేడుకలు, అన్ని మోడల్స్, కుటుంబమంతటికి నచ్చే విధంగా ఇక్కడడ వస్త్రాలు ఉంటాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించటం శుభప్రదం ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో శుభప్రదం షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లక సత్యనారాయణ (అలియాస్ సత్యబాబు), ఆపరేషన్స్ హెడ్ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, ఓంకారప్ప, మంజునాథ్, హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.


చీరలను చూస్తున్న సినీతారలు ఐశ్వర్యరాజేష్, రితికా నాయక్


మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

24, 25 తేదీల్లో చేనేత అధ్యయన యాత్ర

అనంతపురం విద్య, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను కాపాడాలనే లక్ష్యంతో ఈనెల 24, 25తేదీల్లో చేనేత అధ్యయన యాత్రను చేపడుతున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాల యంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. మిల్లు యజమానుల నిర్ణయాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చేనేత పరిశ్రమ దెబ్బతిని నేతన్నలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. చేనేత రిజర్వేషన్ యాక్టు అమలు చేయాలని, చేనేతలకు ఏటా రూ.25వేలు అందించే నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని, 200యూనిట్ల వరకు ఉచిత కరెంటు, చేనేతపెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక నాయకులు పురుషోత్తమ, రాధాకృష్ణ, రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

సచివాలయంలో వైసీపీ నాయకుడి బర్త్ డే


డీ.హీరేహాళ్ సచివాలయంలో అధికారుల మధ్య వైసీపీ నాయకుడి జన్మదిన వేడుకలు

డీ.హీరేహాళ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ నాయకుల సంబరాలకు వేదికగా మారాయి. ఇందుకు నిదర్శనమే మండల కేంద్రంలోని ఒక గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకుడు జన్మదిన వేడుకలు జరపడం. మండల కేంద్రంలో ఉన్న గ్రామ సచివాలయంలో గురువారం స్థానిక వైసీపీ నాయకుడు సింగాడి మంజునాథ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణ, ఇతర గ్రామ సచివాలయ సిబ్బంది ఆ వైసీపీ నాయకుడి సేవలో నిమగ్నమై వేడుకలను ఘనంగా నిర్వహించారు. సచివాలయంలోనే కేక్ కట్ చేసి, సిబ్బందికి పంచిపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ కావడంతో, చూసిన ప్రజలు ఇది ప్రభుత్వ కార్యాలయమా లేకపోతే వైసీపీ కార్యాలయమా అని చర్చించుకుంటున్నారు. కాగా బర్త్‌డే పై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

భారీ స్కోరు దిశగా ఆంధ్ర

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాటర్ల సెంచరీల మోతతో ఆంధ్రా జట్టు భారీ స్కోర్ దిశగా వెళ్తోంది. సీకే నాయుడు అండర్-23 టోర్నీలో భాగంగా ఆంధ్రా-ఢిల్లీ జట్ల మధ్య అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో మ్యాచ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు గురువారం టాస్ గెలిచి ఆంధ్రజట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 74.2ఓవర్లలో స్కోరు 210/2 ఉన్న సమయంలో వర్షం రావడంతో ఆట ముగించారు. రెండోరోజు శుక్రవారం వర్షం కారణంగా ఆలస్యంగా ఆట ఆరంభించారు. ఆటముగిసేసరికి 149ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 470 పరుగులు చేసింది. బ్యాటర్లు ఎస్‌వీ రాహుల్ 292 బంతుల్లో 15 బౌండరీలు, రెండు సిక్సర్లతో 151పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు. అభినవ్ సెంచరీ (101) చేయగా, తేజా 76, సాయిశ్రావణ్ 73పరుగులు చేశారు. దీంతో ఆంధ్రా జట్టు భారీ స్కోర్‌తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. పంగల్‌రోడ్డు సమీపంలోని స్ఫూర్తి విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బాలికల్లో వేణు వైష్ణవి, బాలురలో భాగ్యనాథ్‌రెడ్డి అండర్-19 సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. బేస్‌బాల్ బాలికల జట్టుకు గుల్షాన్ ఎంపికైంది. వీరు ఎస్‌జీఎఫ్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ వెంకట రమణ, పీఈటీ మహేష్ తెలిపారు.

మద్యం మత్తులో అల్లరి.. జైలుకు యువకులు


అరెస్టు చూపుతున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డులో మద్యం తాగి రోడ్డుపై హల్‌చల్ చేసిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు. ఓబులదేవనగర్‌కు చెందిన తిరుమల రాఘవేంద్ర అలియాస్ బిల్లా, సెవెన్‌హిల్స్ కాలనీకి చెందిన కదిరి అరుణ్‌కుమార్ మద్యం మత్తులో గురువారం రాత్రి హౌసింగ్ బోర్డులోని ఎస్ఆర్ వైన్స్ వద్ద రోడ్డుపై వాహనాలకు అడ్డంగా వెళుతూ న్యూసెన్స్ సృష్టించారు. దీంతో టూటౌన్ పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో ఇద్దరికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తు అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. వారిద్దరిని రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

న్యూస్ బాక్స్

మల్లాకాల్వ గంగమ్మను దర్శించుకున్న చిలకం



గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 29వ వార్డు డీఎల్‌ఆర్‌కాలనీలో శుక్రవారం మల్లాకాల్వ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు హోమాలు నిర్వహించి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

సచివాలయ ఉద్యోగులకు స్టేషనరీ పంపిణీ

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో ఉన్న 35వ సచివాలయంలో ఉద్యోగులకు, వారి సేవలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన స్టేషనరీని దాత గుడిపాటి సురేశ్ శుక్రవారంఅందించారు. టీడీపీ 36వ వార్డు ఇన్‌చార్జ్ రాయపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధానంగా వార్డుల్లో ప్రతిరోజు ముగ్గురితో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడానికి ఇబ్బందిగా ఉండడంతో మున్సిపాలిటీలోని కార్మికులందరినీ తీసుకొచ్చి ఒక్కొక్క వార్డులో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 24వ వార్డులో 23, 24 వార్డుల కోఆర్డినేటర్ మాధవరెడ్డి దగ్గరుండి కాలువలను శుభ్రం చేయించారు.

సీజేపై దాడియత్నాన్ని ఖండించిన ఎమ్మార్పీఎస్

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఖండించారు. సీజేపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆంజినేయులు తదితరులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళికృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

● తనకల్లు: సీజేపై దాడిన చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శుక్రవారం దళిత సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. సీజేపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకలు పారేసు, నరసింహులు, ప్రవీణ్‌కుమార్, మూర్తి, శీన, అంజి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల కమిటీ ఎంపిక

కదిరి అర్బన్, అక్టోబరు17 (ఆంధ్రజోతి): ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధేశాల మేరకుతెలుగు యువత మండల కమిటీని శుక్ర వారం ఎంపిక చేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ పోగునూరు చెన్నకేశవులు తెలిపారు. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా వినయ్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఐటీడీపీ అధ్యక్షుడిగా నరసింహులు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలుగా ప్రేమలత, మైనార్టీ మండల అధ్యక్షుడిగా అన్వర్ భాష, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వెంకటేష్ నాయక్, రైతు సంఘం మండల అధ్యక్షడిగా తిరుపాల్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామాంజినేయులు, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా గంగినాయుడును ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

ఓబులదేవరచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో 23వ వార్షిక సమావేశాన్ని అధ్యక్షురాలు వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా పి. లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా భాగ్యమ్మ, కార్యదర్శిగా శారదమ్మ, ఉప కార్యదర్శిగా రత్నమ్మ, కోశాధికారిగా గంగరత్నను ఎన్నుకున్నారు. వెలుగు కోఆర్డినేటర్ కుంచే రవీంద్ర, సీసీలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: వక్తలు



తాడిమర్రిలో విజేతలతో మాట్లాడుతున్న ఎంఈఓ క్రిష్ణమోహన్

తాడిమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ క్రిష్ణమోహన్ పేర్కొన్నారు. తాడిమర్రి ఉన్నతపాఠశాలలో శుక్రవారం వాలీబాల్ అండర్-17 మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో తాడిమర్రి ఉన్నతపాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, కేజీబీవీ విద్యార్థులు రన్నర్స్‌గా, బాలుర విభాగంలో దాడితోట పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, తాడిమర్రి విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారని మండల కో ఆర్డినేటర్ రామాంజినేయులు తెలిపారు.

● నల్లమాడ: మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో అండర్-17 వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ వేమనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ఆటల పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల రన్నర్స్‌గా నిలిచారు. బాలికల విభాగంలో రెడ్డిపల్లి జడ్పీ ఉన్న పాఠశాల విద్యార్థినులు గెలుపొందారు.

● ధర్మవరంరూరల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో శుక్రవారం మండలంలోని విద్యార్థులకు స్కూల్‌గేమ్స్ మండలస్థాయి పోటీలను ఎంఈఓ గోపాల్‌నాయక్ ప్రారంభించారు. తొలిరోజు ఏడు విభాగాల్లో అండర్-14, అండర్-17 బాలబాలికలు పాల్గొని పలువురు క్రీడాకారు లు ప్రతిభ కనబరిచారు.

● కదిరి స్థానిక బాలికల ఉన్నత పాఠశాల అవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుళరెడ్డి ప్రారంభించారు. మండల కోఆర్డినేటర్ శంకర్‌నాయక్, పీడీలు యశోద, సంధ్య, లస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కదిరి విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం

కదిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు రూరల్ పరిధిలోని హరీష్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. ఈ నెల 11, 12 తదీలలో చిత్తూరు జిల్లా నేరేబైలులో జరిగిన పోటీల్లో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు శైలజ, హిమబిందు, ఆర్థిక పాల్గొన్నారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు బీహార్ రాష్ట్రంలోని బిగుసరాయ్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

రక్షణ గోడలు లేని వంతెన

వాహనదారుల్లో ఆందోళన



మోటుమర్ల వద్ద రక్షణ గోడలు లేని వంతెన

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోటుమర్ల గ్రామం వద్ద ఉన్న వంతెనపై రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి పుట్టపర్తి, గోరంట్ల, బెంగళూరు ప్రాంతాలకు పగలు, రాత్రి సమయాల్లో వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే వంతెనపై రక్షణ దిమ్మెలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు తీవ్ర భయాందోళన కు గురవుతుంటారు. వంతెన నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రక్షణ దిమ్మెలు ఏర్పాటుచేయాలన్న ఆలోచన కూడా ఆర్ అండ్‌బీ అధికారులకు రాలేదా అని పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఏ మాత్రం ఏమర పాటు వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. నిత్యం ఈ వంతెనపై మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు రాకపోకలు సాగిస్తున్నా రక్షణ దిమ్మెలు వేయాలన్న ఆలోచించకపోవడం దారుణమని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై రక్షణ దిమ్మెలు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● అధికారులకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి ఆదేశం



చిత్రావతి సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటిని వేగవంతం చేసి సత్యసాయిబాబా శతజయంతి వేడుకల నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం మునిసిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, డీఈ నరసింహమూర్తి ఇతర ఇంజనీర్లతో కలసి పరిశీలించారు. జాయ్‌లుకాస్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.1.20 కోట్ల వ్యయంతో జరుగుతున్న పార్క్, స్నాన ఘాట్ పనులను పరిశీలించారు. నవంబరు 10నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణాన్ని శుభ్రంగా, సుందరీకరణతో ఆదర్శం గా తీర్చి దిద్దాలని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మునిసిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కరణం సుబ్రహ్మణ్యం, షామీర్ పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. రోగాలు రావా..?

● చిగిచెర్ల పర్యటనలో జడ్పీ సీఈఓ ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీ సీఈఓ శివశంకర్

ధర్మవరంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాల జడ్పీ సీఈఓ శివశంకర్ పర్యటించారు. రోడ్డుపై మురుగునీటి నిల్వ, చెత్త దిబ్బలు ఉండటంతో... ఇలా ఉంటే రోగాలు రావా అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ... ఇళ్ల నుంచి రోడ్డుపైకి నీరు వదలకూడదని, ఇంటివద్దే సోపిట్ ఏర్పాటుచేసుకోవాలన్నారు. ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది గ్రామంలో తిరిగి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో చెత్తాసేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపదే లక్ష్యంగా గ్రామంలోని చెత్తాచెదారాన్ని కేంద్రానికి తరలించాలని కార్మికులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి, పార్థారెడ్డి, గణేష్‌రెడ్డి, చంద్రాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి.. డ్వాక్రా మహిళల పెన్నిధి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి బ్యాంకు.. స్వయం సహాయక సంఘాల మహిళలకు పెన్నిధిలాంటిదని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్త్రీనిధి ఆంధ్రప్రదేశ్ పోస్టర్లను డీఆర్‌డీఏ పీడీ నరసయ్యతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్త్రీనిధి ద్వారా 11 శాతం వడ్డీతో ప్రతి మహిళ లక్షరూపాయల వరకు రుణం తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. స్త్రీనిధి సురక్ష రుణ పథకం ద్వారా రుణం తీసుకున్న మహిళలు మరణిస్తే మొత్తం రుణం మాఫీ అవుతుందన్నారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 23,411 మంది డ్వాక్రా మహిళలకు రూ.234 కోట్లు రుణాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 9,903 మందికి రూ.89 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల మహిళలు తమ జీవనోపాధి మెరుగు కోసం స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం అనిమేష్, ఏపీఎం ఓబులేసు పాల్గొన్నారు.

రాయల పాలన స్వర్ణయుగం

● వర్ధంతి కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు



బుక్కపట్నంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సభలో పాల్గొన్న గ్రామస్థులు

బుక్కపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాలన స్వర్ణయుగమని బలిజ సంఘం మండల నాయకులు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకృష్ణదేవరాయల పాలన స్వర్ణయుగమని, ఆయన పాలనలో చెరువులు తవ్వించి, దేవాలయాలు కట్టించి ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. బలిజసంఘం నాయకులు దేశెట్టి సంజీవ రాయుడు, దాసరి శ్రీనివాసులు, కరణం శ్రీనివాసులు, లక్ష్మీనరసప్ప, చెన్నకృష్ణ, రమేష్, శివయ్య, యువనాయకులు సతీష్ రాయల్, బుచ్చయ్యగారిపల్లి చంద్ర, సూరి, భాస్కర్, చిరంజీవి, తోట అనిల్, రమణరాయల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

● అదేవిధంగా పుట్టపర్తిలో కాపుసంఘం నాయకులు చింతా దామోదర్ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయల చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కదిరి పట్టణంలో పట్టణ బలిజ సేవా సంఘం, రాయల్ ప్యూపుల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తలుపుల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద బలిజ సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ముదిగుబ్బలో బలిజ కులస్థులు శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్ర మైన అమడగూరు, మండలంలోని మహమ్మదాబాదులలో ఆవిష్కరణకు తీసుకొచ్చిన శ్రీకృష్ణదేవరాల విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. వాటిని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నల్లమాడలోని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ నివాసం వద్ద శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పాఠశాలలో దీపావళి



రిషి పాఠశాలలో దీపావళి చేసుకుంటున్న విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి పాఠశాలలో దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పుష్పాలంకారంతో దీపాలను తయారు చేసి వెలిగించారు. పూలతో ముగ్గులు వేశారు. పాఠశాల డీన్ బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... మన సనాతన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరణ్‌స్వరూప్‌సింగ్, సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయ స్థలం పరిశీలన

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో టపాసుల దుకాణాల ఏర్పాటుపై ఆర్డీఓ మహేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... టపాసులు నిల్వచేసేవారికి, వివిధ ప్రభుత్వ శాఖల అధికాధులకు పలు సూచనలు చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సురేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

అమడగూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా దీపావళిని సురక్షితంగా, వెలుగుల పండుగగా జరుపుకోవాలని ట్రైనీ ఎస్సై ప్రదీప్‌రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణా సంచాను ఖాళీ ప్రదేశంలోనే కాల్చాలని సూచించారు. బాణ సంచా పేల్చే సమయం లో పిల్లలు తగుజాగ్రత్తలు పాటించేలా తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాండ్లపెంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్న సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కావున మండలంలోని ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

చెట్లతోనే మానవుడి మనుగడ: ఆర్డీఓ

గాండ్లపెంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో మానవుడి మనుగడ ముందుకు సాగుతుందని ఆర్డీఓ వీవీఎస్ శర్మ శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో ఉన్న రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామీణ మహిళా రైతు వారోత్సవాలలో భాగంగా మహిళా దివాస్ నిర్వహించారు. ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు బానుజా ఆధ్వర్యంలో ఆయన ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండిస్తున్న మహిళా రైతులను సన్మానించారు. పలువురు మహిళలకు వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో సెంట్రీ సంస్థ సభ్యులు అరుణ్‌కుమార్, రెడ్స్ సంస్థ సభ్యులు రాజశేఖర్, శ్రీనివాసులు, ఎల్లప్ప, మహిళా రైతులు పాల్గొన్నారు.

చెరువుకు నీటి విడుదల

ధర్మవరంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుల చెరువు చెరువుకు ధర్మవరం చెరువు తూము నుంచి నీరు విడుదల చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ధర్మవరం చెరువు తూముల ద్వారా వెళ్లే కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం గంగపూజ చేశారు. టీడీపీ నాయకులు గొట్లూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ మేకల రామాంజినేయులు, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు

నల్లమాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2025 సంవత్సరంలో పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఆ పాఠశాలలో 1991-92 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు శుక్రవారం నగదు బహుమతులతో పాటు మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వేమనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి బహుమతి గా విద్యార్థి మోక్షిత్‌కు రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా విద్యార్థి టి. జ్యోత్స్నకు రూ.6వేలు, తృతీయ బహుమతి విద్యార్థి దేవతేజ రూ.5 వేలను, నాలుగో బహుమతి విద్యార్థి సంతోష్‌కు రూ.3వేల ప్రకారం నగదు, మెమెంటోలు అందజేశారు. ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు జయశంకర్, పూర్వపు విద్యార్థులు ఎన్ఈ రామాంజినేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన పరిటాల శ్రీరామ్



రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నను కలిసిన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ శుక్రవారం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నెలకొన్న రైల్వేసమస్యలను విన్నవించారు. కేంద్ర మంత్రి సోమన్న రాయదుర్గం- టుముకూరు మధ్య జరుగుతున్న రైల్వే పనులను పరిశీలించేందుకు పావగడకు వచ్చారు. పరిటాలశ్రీరామ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నెలకొన్న రైల్వే సమస్యలను వివరించారు. ఇప్పటికే వీటిపై వినతప త్రాలు కూడా ఇచ్చినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పరిటాల శ్రీరామ్‌తో పాటు ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ ఉన్నారు.

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును పొడిగించాలని వినతి

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ధర్మవరం - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడింగిచాలని కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి సోమన్నకు వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు సురేష్, మహేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు సూపర్ జీఎస్టీ పై అవగాహన

కదిరి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ - 2.0 సంస్కరణల్లో భాగంగా శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ శ్రీకృష్ణదేవరాయలు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

తాడిమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం మూలంగా ముంపునకు గురైన సీసీరేవు, మర్రిమాకులపల్లి గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు, ఆర్‌అండ్‌బీ డీఈ పుల్లంరావు, ఏఈఈ మహాలక్ష్మి శుక్రవారం పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. సీబీఆర్ డీఈ చంద్రసురేశ్, ఏఈ హనీఫ్, బీజేపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వందేభారత్‌కు పురంలో స్టాపింగ్

● రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న


రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి, ఎంపీ తదితరులు

మడకశిరటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): త్వరలో హిందూపురంలో వందేభారత్ రైలుకు స్టాపింగ్ కల్పించనున్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని వజ్రపాళ్యం వద్ద జరుగుతున్న రైల్వేలైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంపీ బీకే పార్థసాధి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలతో కలిసి పనుల పురోగతిపై సమీక్షించారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గం-తుమకూరు రైల్వే లైన్ నిర్మాణంతోపాటు విద్యుద్దీకరణ పూర్తి చేసేందుకు ఎల్‌సీఎం పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. 2027 మార్చి నాటికి రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. 192 కిలోమీటర్ల మేరకు రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. తమకూరు-దావణగెరె ప్రాంతంలో 2027 జూన్, జులై నాటికి శిరా, బరంసాగర, దావణగెరె, చిత్రదుర్గం 400 కిలోమీటర్ల మేరకు రైల్వేలైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాల వ్యవధిలో పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో నిర్మాణ పనులు వేగంగా సాగేందుకు చంద్రబాబు అన్ని విధాలా సహకారం అందిస్తున్నారని అన్నారు. హిందూపురం నుంచి గుడిబండ మండలంలోని హిరియూరు వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్లో క్విజ్ పోటీలు: డీఈఓ


కౌశల్ క్విజ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఉన్నత పాఠశాలలో విద్యార్థులు కౌశల్ క్విజ్ పోటీలో పాల్గొనేలా హెచ్‌ఎం, టీచర్లు చర్యలు తీసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన కౌశల్ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ శనివారం కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళి, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.21

అనంతపురంరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.12, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

బతుకు పోగు..!

(7వ పేజీ తరువాయి)

కూడా గార్మెంట్స్ పరిశ్రమ యాజమాన్యాలకు కలిసివస్తోంది. గార్మెంట్స్ పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తులను దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పేరుమోసిన కంపెనీలు జిల్లాలోని గార్మెంట్స్ పరిశ్రమల్లో తయరైన వాటిని కొనుగోలు చేస్తున్నాయి.

ఔత్సాహికులను ప్రోత్సహిస్తే..

2014-19లో టీడీపీ ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారి ఆదాయం పెంచే ప్రయత్నాలు చేసింది. అందులో భాగంగా ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేలు ఆదాయం చేకూర్చాలని భావించింది. జిల్లాలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించవచ్చని భావించారు. ఆ మేరకు దృష్టి సారించి ఔత్సాహికులను ప్రోత్సహించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్థాపించినా జిల్లాలో కనీసం లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించవచ్చు. ఆ దిశగా 2017లో సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రుల బృందం హిందూపురం, పరిగి ప్రాంతాల్లోని గార్మెంట్ పరిశ్రమలను పరిశీలించింది. పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆహ్వానించింది. ఫలితంగా గోరంట్ల, చిలమత్తూరు, మడకశిర ప్రాంతాల్లో మరిన్ని గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. అవి ప్రస్తుతం వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి.

వైసీపీ ప్రభుత్వం విధానాల కారణంగా గత ఐదేళ్లలో జిల్లాకి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఉన్న అవకాశాలనూ చేజార్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. టీడీపీ హయాంలో రచించిన కార్యాచరణ దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తే వేలాదిమంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. తద్వారా ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా దక్కుతుంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని అనంత వాసులు కోరుతున్నారు.


కోడూరు వద్ద గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు

ఎన్నో కుటుంబాలకు ఉపాధి



వ్యవసాయ పనులులేక చాలాకాలం ఇబ్బందులు పడ్డాం. కోడూరు వద్ద గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటవడంతో ఐదేళ్లుగా అందులోకి పనికెళ్తున్నాం. కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు. గార్మెంట్ పరిశ్రమలతో ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. మరిన్ని ఏర్పాటుచేస్తే చాలామందికి ఉపాధి దొరుకుతుంది.

-పార్వతి, కల్లుకుంట, చిలమత్తూరు మండలం

పరిశ్రమ ఏర్పాటు చేయడం మా అదృష్టం



మా ఊరికి దగ్గర్లో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకావడం మా అదృష్టం. కొన్నేళ్లగా మా గ్రామం నుంచి చాలా మంది గార్మెంట్స్‌లో పనిచేయడానికి బెంగళూరుకు వలస వెళ్లారు. అక్కడ వేతనాలు ఎక్కువగా ఇచ్చినా ఖర్చులు అదేస్థాయిలో ఉంటాయి. దాంతో పెద్దగా మిగలదు. ఊరి సమీపంలోనే గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిమందికి ఉపాధి లభిస్తోంది. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-నందిని, మొరసలపల్లి, చిలమత్తూరు మండలం

సొంతూర్లోనే పని దొరికింది



కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు తోపులో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటుకావడంతో చాలామంది మహిళలకు ఉపాధి దొరికింది. లేదంటే బెంగళూరుకి వలస వెళ్లాల్సి వచ్చేది. సొంతూరి వద్దే పని దొరుకుతుండడంతో కుటుంబం గడిచిపోతోంది. ఇలాం టి పరిశ్రమలు మరిన్ని ఏర్పాటుచేసి, వేతనాలు పెంచితే బాగుంటుంది.

-గాయత్రి, కొడికొండ చెక్‌పోస్టు, చిలమత్తూరు మండలం

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం: అమరావతి, పరిగి



గతంలో ఇటుకలు బట్టీ పనికి వెళ్తుండేదానిని. రోజంతా కష్టపడితే రూ.150 కూలీ ఇచ్చేవారు. దుమ్ముధూళితో అనారోగ్య సమస్యలు వచ్చేవి. పరిగిలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి దొరికింది. ఆర్థిక భరోసా లభించింది.

ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలి



గార్మెంట్ పరిశ్రమలతో వేలాదిమంది మహిళలకు ఉపాధి లభిస్తోంది. మా ఊరి నుంచి 55 కిలోమీటర్లు రోజూ ప్రయాణించి, పరిగిలో గార్మెంట్ పరిశ్రమకు 50 మంది మహిళలు వస్తున్నాం. పరిశ్రమ యాజమాన్యమే బస్సు సౌకర్యంతోపాటు నెలకు రూ.14 వేలు వేతనం ఇస్తోంది. పరిశ్రమ లేకపోతే బెంగళూరుకు వలస వెళ్లాల్సి వచ్చేది.

-శ్వేత, కల్లురొప్పం, రొళ్ల మండలం

క్రీడాకారులకు 'డబుల్' ప్రోత్సాహం: డీఎస్‌డీఓ



సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ చేస్తున్న డీఎస్‌డీఓ, కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడా పరికరాలపై జీఎస్టీ తగ్గింపు, రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంచడంతో క్రీడాకారులకు డబుల్ ప్రోత్సాహం దక్కిందని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. శాప్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఎ) ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఉత్సవాలలో భాగంగా స్థానిక అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియం నుంచి నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇండోర్‌స్టేడియంలో క్రీడాపరికరాల జీఎస్టీ తగ్గింపుపై స్టాల్స్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మంజుల మాట్లాడుతూ క్రీడా వస్తువలపై జీఎస్టీ 18శాతం నుంచి 5శాతానికి తగ్గించడంతో క్రీడాకారులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ డీఏసీ సుబ్బన్న, ఖై భారత్ ప్రోగ్రాం ఇంచార్జి శ్రీనివాసులు, శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, ఆలీ, నరేష్, లక్ష్మి, సంధ్య, యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మున్వర్ బాషా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన మోటార్లు

రాగులపాడు లిఫ్ట్ వద్ద పనిచేయని వైనం

హంద్రీనీవా కాలువ నుంచి ఎస్కేప్ చానల్ ద్వారా నీటి మళ్లింపు


కాలువకు గండి కొట్టి నీటిని మళ్లించిన అధికారులు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగులపాడు లిఫ్ట్ వద్ద మోటార్లు పనిచేయక పోవడంతో ఛాయాపురం సమీపంలో హంద్రీనీవా నుంచి ఎస్కేప్ చానల్ ద్వారా కాలువకు గండి కొట్టి నీటిని మళ్లించారు. రాగులపాడు 8వ లిఫ్ట్ వద్ద సాంకేతిక లోపం కారణంగా ఏడు మోటార్లు పనిచేయలేదు. మూడు మోటార్లు మాత్రమే పని చేస్తుండటం, లిఫ్ట్‌కు 2900క్యూసెక్కులు వస్తుండటంతో ముందస్తు చర్యలలో భాగంగా కాలువకు గండి పడకుండా ఎస్కేప్ చానల్ ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు నీటిని మళ్లించారు. మోటార్లకు మర్మతులు చేసి, యథావిధిగా పంపింగ్ చేపడతామని అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఛాయాపురం వద్ద కాలువకు గండి కొట్టాల్సి వచ్చిందని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విమర్శించారు. ఛాయాపురం వద్ద ఎస్కేప్ చానల్‌కు శాశ్వత గేట్లు అమర్చి ఉంటే కాలువకు గండి కొట్టే అవసరముండేది కాదన్నారు. ఎస్కేప్ చానల్‌కు గేట్లు అమర్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

31న ఓసీ విద్యార్థి యువగర్జన

ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో ఈనెల 31న నిర్వహించే ఓసీ విద్యార్థి యువగర్జన మహాసభను జయప్రదం చేయాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్ చౌదరి, నాయకులు మాధవరెడ్డితో కలిసి మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఓసీల్లో కూడా పేదలు ఉన్నారని, అత్యంత పేదరికంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రంగాల్లో అణిచివేతకు గురవుతున్న ఓసీ విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఓసీలు వలసలు పోవడం తదితర అంశాలపై చర్చించేందుకు మహాసభకు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేష్‌రాయల్, కేశవరెడ్డి, ఆదికేశవరెడ్డి, ఆదినారాయణరెడ్డి, షాహిద్ ఆఫ్రిది, శ్రీకాంత్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సోమందేపల్లి విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సోమందేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు సోమందేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామాంజనేయులు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అనంతపురంలోని అనంతలక్ష్మి కళాశాలలో నిర్వహించిన ఈత పోటీల్లో 9, 10తరగతికి చెందిన ప్రత్యూష, నవీన్‌కుమార్, హేమశ్రీ, తరుణ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సాదిక్, రాకేష్, అశ్విన్, నర్మద ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు బాలాజీ నాయక్, రామారావు, అలివేలమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్ల తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

న్యూస్ బాక్స్

ఘనంగా మారెమ్మ ఉత్సవం



గుడిబండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకాతి గ్రామంలో వెలసిన మారెమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవాలను గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కోనాపురంలో మారెమ్మ జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న మారెమ్మ ఆలయాన్ని గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, అశోక్, ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. శుక్రవారం వేద పండితులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జంతు బలులు ఇచ్చారు.

వైభవంగా పాలుపోసే పండుగ

రొళ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీజీ హట్టి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో పాలుపోసే పండగను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీయత్తప్ప, చిత్రలింగేశ్వర స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణచేసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి తమ జీవాల పాలను సేకరించి ఊరేగింపుగా వచ్చి స్వామివారికి పాలను నైవేద్యంగా పెట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. వక్కలిగ చైర్మన్ లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, ఈరన్న, పాండురంగప్ప ఉగ్రేగౌడ్, భరత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం: టీడీపీ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న శ్రీనివాసులు

చిలమత్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కరిస్తామని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య బీసీ కాలనీలో పల్లెబాటలో భాగంగా పర్యటించిన సందర్భంగా కాలనీ వాసులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆయన సూచించారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ చైతన్యతో కలిసి తాగునీటి సమస్యకు పరిష్కారంపై చర్చించారు. నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, భాస్కర్, మల్లికార్జున, విశ్వనాథరెడ్డి, చంద్ర, ఆంజనేయులు, గౌస్, రఫిక్, గంగాధర్, కృష్ణమూర్తి ఉన్నారు.

రక్షణ కల్పించండి

● పాలిటెక్నిక్ విద్యార్థినుల డిమాండ్



ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలికల కళాశాలలో రక్షణ కల్పించాలని విద్యార్థినులు నిరసన తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థినులు బైఠాయించి నిరసన తెలుపుతూ మూడు రోజుల వ్యవధిలో రెండు రాత్రుల్లో గుర్తుతెలియని దుండగులు వసతి గృహంలో ప్రవేశించి సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారన్నారు. సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లడంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా గురువారం రాత్రి మరోసారి వసతి గృహంలో ప్రవేశించారన్నారు. కళాశాల వసతి గృహంచుట్టూ ముళ్లపొదలు ఏపుగా పెరిగాయని ప్రహరీ కూలిపోవడంతో దుండగులు ప్రవేశిస్తున్నారన్నారు. దీనిపై పోలీసులు కళాశాలకు, తమకు భద్రత కల్పించాలని ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. వీరికి పీడీఎస్‌యూ నాయకులు బాబావలి మద్దతు తెలిపి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి నాయుడుకు వినతిని అందించారు. విద్యార్థినులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డీఎస్పీ మహేష్ అన్నారు. వసతిగృహంవద్ద రాత్రిపూట పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.

డీఈఓపై ఫిర్యాదు

పావగడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సంతకాలను ఫోర్జరీ చేసి రూ.10.47లక్షలు డీఈఓ యశోద కుమార్ తన భార్య పేరుపై బదలాయించినట్లు కోటగుడ్డం గ్రామపంచాయతీ పీడీఓ భవ్య వైఎన్ఎస్‌కోట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గత యేడాది జూలై నుంచి కోటగుడ్డం గ్రామ పంచాయతీ పీడీఓగా భవ్య విధులు నిర్వహిస్తోంది. 15వ ఆర్థిక ప్రణాళికలు పలు అభివృద్ధి పనులకు వెండర్ ద్వారా నిధులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ జాబ్‌చార్ట్ ప్రకారం గ్రామ స్వరాజ్ నిధులను డీఈఓ యశోదకుమార్ ఎస్సార్ మార్కెట్ అని నమోదు చేసి ఆయన భార్య రిచా ఖాతాకు నగదును బదలాయించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగ నియమానుసారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మాళప్ప తెలిపారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

● కమిషనర్ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్/పెనుకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ సమీపంలో 698సర్వే నంబరులో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లలో మున్సిపల్ కార్మికులు రాళ్లను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికాఅధికార లేఅవుట్‌లు క్రమబద్ధీకరించుకోవడానికి జీఎంఎస్ నం.134ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అయినా క్రమబద్ధీకరించుకోలేదన్నారు. అలాంటివాటిని ఇదివరకే గుర్తించామన్నారు. వీటిలో పాట్లు కొంటే తీవ్రంగా నష్టపోతారన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం: సీఐ

హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉంటుందని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అన్నారు. శుక్రవారం సప్తగిరి కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ ఆదర్శ్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్లస్టర్‌ఆఫ్ లాగ్ లెవెల్ స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, పరుగు పందాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ఏఓ గంగిరెడ్డి, ఎంబీఏ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు ఈ-క్రాప్ కష్టాలు..!

● పంట నమోదు కాలేదంటున్న అన్నదాతలు
● ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వైనం
● పట్టించుకోని వ్యవసాయాధికారులు



మొక్కజొన్న దిగుబడిని ఆరబెడుతున్న రైతు

చిలమత్తూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పథకాలు అందాలంటే ఖచ్చితంగా సాగుచేసిన పంటను ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని గొగ్గోలు పెట్టే అధికారులు, ప్రస్తుతం అదే పంట నమోదు కార్యక్రమాన్ని నత్తనడకలా సాగిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచే పంటలు పూర్తిగా సాగైన తరువాత వ్యవసాయాధికారులు పొలాలను సందర్శించి వివరాలను ఈక్రాప్ బుకింగ్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ ఖరీఫ్‌లో అధికారుల అలసత్వంతో ఇప్పటికీ ఈ కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా ఖరీఫ్ పంటలు ఇప్పటికే అక్కడక్కడ కోతకు వచ్చాయి. కొన్ని చోట్ల మొక్కజొన్న, వేరుశనగ పంటల కోతలు జరిగిపోయాయి. వాటికి అధికారులు ఈక్రాప్ బుకింగ్ చేయకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈక్రాప్ బుకింగ్‌లో పంట నమోదు జరగకపోతే పంట సాగుచేయలేదని అర్థం. పంటలకు సంబంధించి ప్రభుత్వం ఏవైనా రాయితీలు, బీమా వంటివి ప్రకటిస్తే ఆ సమయంలో ఈక్రాప్ బుకింగ్ కాని పంటలకు వర్తించవు. ఇప్పటివరకు పంట నమోదు కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలలుగా మొక్కజొన్న ధరలు తగ్గుముఖం పట్టాయి. క్వింటాల్ ధర రూ.1850 నుంచి రూ.2వేల వరకు ఉంటోంది. గత ఏడాది ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసింది. కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలంటే తప్పకుండా ఈక్రాప్ బుకింగ్ జరిగి ఉండాలి. పలు రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే కొందరు రైతులు మొక్కజొన్న పంటను కోసుకున్నారు. పంట నూర్పిడి చేసుకున్నారు. అలాంటి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. వారు పండించిన పంటకు ఈక్రాప్ నమోదు కాకపోవడంతో వాటిని ప్రభుత్వం ఏర్పాటుచేసే విక్రయకేంద్రంలో విక్రయించుకునే అవకాశం లేకుండా పోయింది. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది పంట నమోదులో తీవ్ర జాప్యం జరిగిందని, తాము ప్రభుత్వం నుంచి అందే పథకాలను కోల్పోవలసి వస్తుందేమో అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంట నమోదులో ఆలస్యం జరగతుండటంపై మండల వ్యవసాయాధికారి కవితారాణిని వివరణ కోరగా ఈ నెల 25 వరకు పంట నమోదుకు అవకాశం ఉందని, సిబ్బంది కొరతతో ఆలస్యం జరిగిందన్నారు. ఇప్పటికే పంటలు కోసుకున్న వారికి న్యాయం జరిగేలా ఆ పంటలను కూడా నమోదు చేస్తామన్నారు.

గ్యారెంటీల పేరుతో రాష్ట్రాన్ని ముంచిన కాంగ్రెస్

● జనవరి 30కి పావగడలో రైలు సంచారం
● కేంద్ర మంత్రి సోమన్న



నాయకులతో కలిసి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి సోమన్న

పావగడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలను గ్యారెంటీల పేరుతో మోసం చేస్తూ రాష్ట్రాన్ని నట్టేట ముంచిందని కేంద్ర జలవనరులు, రైల్వే శాఖ మంత్రి సోమన్న విమర్శించారు. శుక్రవారం పావగడ తాలూకా దొడ్డహళ్లి, టీఎన్‌పేట గ్రామాల సరిహద్దులో జరుగుతున్న రైల్వే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం అభివృద్ధి పనులపై ఎన్ని ఆరోపణలు చేసినా తమ పనులు తాము చేసుకుపోతామన్నారు. జనవరి 30లోగా పావగడకు రైలు సంచారం తన చేతుల మీదుగా ప్రారంభిస్తానని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఏమాత్రం అభిమానం, విశ్వాసమున్నా రైతులను అన్నివిధాలా ఆదుకుని అభివృద్ధి చెందేలా కృషిచేయాలని సూచించారు.

ఏం బాబు బాగున్నావా అని ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను మంత్రి సోమన్న ఆప్యాయంగా పలకరించారు. దొడ్డహళ్లిలో రైల్వే పనుల పరిశీలనలో భాగంగా పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, సమాజసేవకుడు ఎగువపల్లి నానితో కలిసి పావగడలో శ్రీరామ్ పర్యటిస్తున్న సందర్భంగా మంత్రి ఆయనతో ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులపై ఆరాతీశారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, గుండుమల తిప్పేస్వామి, బీజేపీ నాయకుడు తిప్పేస్వామి, శివప్రసాద్, అశోక్, శంకర్‌రెడ్డి వారి వెంట ఉన్నారు.

మంత్రి, ఎంపీకి ఘన సన్మానం



మంత్రి, ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

మడకశిరటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే, జలవనరుల శాఖ సహాయ మంత్రి సోమన్న, ఎంపీ బీకే పార్థసారధిని శుక్రవారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. క్లాస్‌వన్ కాంట్రాక్టర్ జయప్ప, లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ సన్మానం చేశారు. టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటికి కేంద్రమంత్రి, ఎంపీలు ఉదయం 11 గంటలకు చేరుకొన్నారు. అక్కడ అల్పాహారం స్వీకరించిన అనంతరం పావగడ నియోజకవర్గం కె.రాంపురానికి వెళ్లారు. రైల్వేలైన్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. అక్కడి నుంచి కదిరేపల్లి, దొడగట్ట, పావగడ, వడ్రపాళ్యం వరకు రైల్వేలైన్ పనులను పరిశీలించారు. అక్కడక్కడా సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంప్ కార్యాలయానికి చేరుకొన్నారు. విలేకరుల సమావేశం అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఉన్నారు.

చెట్ల నరికివేత



కాలువ పక్కన నరికేసిన చెట్లు

సోమందేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో చెరువు మరువకాలువలో సైడ్‌వాల్ పనులు చేపట్టాడు. గట్టుపై ఉన్న చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీ నిధులతో గుడిపల్లి, కొత్తూరుకు ఆనుకుని పనులు ప్రారంభించగా అటవీ అనుమతులు తీసుకోకుండా చింత, వేప చెట్లను తొలగించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఏ అభివృద్ధి పనులు చేపట్టినా పచ్చనిచెట్లు నరకాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇష్టారీతిన చెట్లను తొలగించడంపట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై అటవీశాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా తమవద్ద ఎలాంటి అనుమతి తీసుకోలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ బ్యాంక్ ఉద్యోగి మృతి

సోమందేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మాగేచెరువు కెనరాబ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న మాల శివకుమార్(55) గురువారం సోమందేపల్లి సంతలో కాలుజారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు వారు తెలిపారు.

వలస కూలీ..

రొద్దం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నారనాగేపల్లి గ్రామానికి చెందిన పాముల సుబ్బరాయుడి కుమారుడు పాముల వెంకటేశ్(30) చెట్టుపై నుంచి కిందపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. రొద్దం మండలం నారనాగేపల్లికి చెందిన పాముల వెంకటేశ్ చిత్తూరు జిల్లాలో జరుగుతున్న పనులకు వెళ్లాడు. అక్కడ టేకుచెట్లు కత్తిరింపు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వారం క్రితం కిందపడి తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం స్వగ్రామమైన నారనాగేపల్లికి మృతదేహాన్ని తీసుకురాగా టీడీపీ నాయకులు మనోహర్, నాగభూషణం, ధనుంజయ, గోవిందు పూలమాలలువేసి నివాళి అర్పించారు. మృతుడి భార్య గంగమ్మకు రూ.7వేలు ఆర్థిక సాయం అందించారు.

డ్రైనేజీ కాలువల ఆక్రమణ

● రోడ్లపైకి మురుగునీరు.. చర్యలు తీసుకోండి
● కౌన్సిల్ మీట్‌లో సభ్యుల ధ్వజం

పెనుకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో నిర్మించిన మురుగు కాలువలన్నీ ఆక్రమణకు గురికావడంతో మురుగునీరన్నీ రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫరూక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కోరం లేకపోవడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. 20మంది సభ్యులకుగాను చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు ఆరుగురు వైసీపీ సభ్యులు, ఇద్దరు టీడీపీ సభ్యులు హాజరు కావడంతో సమావేశం ప్రారంభించారు. కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ తన వార్డులో వీధిదీపాలు వెలగడంలేదని డ్రైనేజీలు శుభ్రం చేయక మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయన్నారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కోఆప్షన్ సభ్యులు రఫీక్ మాట్లాడుతూ మారుతినగర్ నుంచి ఈద్గా వరకు మురుగునీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన కమిషనర్ సతీష్‌కుమార్, చైర్మన్ త్వరలో సమస్యలుపరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేనేజర్ వెంకటరమణ, కౌన్సిలర్లు భాస్కర్ నాయుడు, గీతాహనుమంతు, సప్తగిరి, పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీలు



పరిగిలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పరిగి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని విద్యార్థులకు అండర్-14, అండర్-17 వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షెటిల్ పోటీలను శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థుల జట్టు 25న డివిజన్‌స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. 14పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం కృపాసత్యరాజ్ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు నైపుణ్యత పెంపొందించుకోవాలని సూచించారు. పీఈటీ వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం నిర్వహించినట్లు మండల కో ఆర్డినేటర్ విజయకుమారి, పీడీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో గుండుమల ఎంజేపీ బాలుర జట్టు, రేకలకుంట ఉన్నత పాఠశాల బాలికల జట్టు ఘన విజయం సాధించినట్లు తెలిపారు. వారు మాట్లడుతూ అండర్-17 వాలీబాల్ పది బాలురుజట్లు, 3 బాలికల జట్టు కలిపి 120 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర గెలుపొందిన జట్లును అభినందించారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మండల స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్ అండర్-17 పోటీల్లో బాలికలు విన్నర్స్‌గా నిలిచారు. అండర్-14 బాలుర పోటీల్లో రన్నర్స్‌గా నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఇంటికీ లబ్ధి: టీడీపీ

పెనుకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరుతుందని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆల్విన్‌కాలనీలో జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రఘువీరచౌదరి, షౌకత్, నంజుండ, చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, జనసేన శ్రీదేవి, బీజేపీ హనుమంతు, చంద్రాయుడు, సోము పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సూపర్‌జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని



కరపత్రాలు పంచుతున్న కూటమి నాయకులు

కూటమినాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. మండల కన్వీనర్ ఈశ్వరప్రసాద్, పోతిరెడ్డి, కేశవయ్య, నారాయణస్వామి, వెంకటరాముడు, సూర్యనారాయణ, సోమశేఖర్, సిద్దయ్య పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతు సంఘం మండల నాయకుడు హరిక్రిష్ణ అన్నారు. జీఎస్‌టీ తగ్గింపువల్ల తాను బొలేరో వాహనం కొనగా రూ.లక్ష తగ్గినట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఉపశమనం కలిగిందన్నారు. రైతులు పేద ప్రజలకు పన్నుభారం తగ్గి లబ్ధిచేకూరుతుందన్నారు.

రొద్దం(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించిన జీఎస్టీ సంస్కరణలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య కోరారు. శుక్రవారం రొద్దం మండలంలోని పి.కొత్తపల్లి, రొప్పాల, పెద్దమంతూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. కన్వీనర్ నరహరి, టైలర్ ఆంజనేయులు, చంద్రమౌళి, రాము, అశ్వత్థనారాయణ, శంకర్, సుబ్బు పాల్గొన్నారు.



ఎంజీఎం మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జీఎస్టీ చెల్లించినవారికే షాపులు

హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని తాత్కాలికంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాలకు జీఎస్టీ చెల్లిస్తేనే కేటాయింపు జరుగుతుందని అధికారులు తెలిపారు. గత యేడాదివరకు షాపులు ఏర్పాటుచేసుకుని అమ్మకాలు జరిపే సమయంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెళ్లి షాపులవద్ద ట్యాక్స్ వసూలు చేసేవారు. ఈసారి ప్రభుత్వ నిబంధనలు మార్చడంతో ముందుగానే జీఎస్‌టీ చలానా చూపించిన వారికే షాపులు కేటాయిస్తామని అధికారులు తేల్చారు. హిందూపురం 91మంది దరఖాస్తు చేసుకోగా రూ.30వేలు చలానా తీయాలని చెప్పేసరికి ఆ సంఖ్య 40కు తగ్గింది. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గ పరిధిలో 200కుపైగా దరఖాస్తు చేసుకున్నారు. మండల కేంద్రాల్లో సైతం 15నుంచి 20వేలు చలానా తీయాలని కలెక్టర్ చెప్పారు. దీంతో శుక్రవారం సాయంత్రానికి ఈ మూడు నియోజకవర్గాల్లో 60మంది మాత్రమే చలానా తీశారు. ఇందులో 40హిందూపురం పట్టణంలోనే ఉన్నాయి.

ఎంజీఎం క్రీడామైదానంలో బాణసంచా షాపుల ఏర్పాటు

ఎప్పటిలాగే ఈసారికూడా దీపావళి పండగకు తాత్కాలికంగా బాణసంచా షాపులు ఏర్పాటు చేసుకోవడానికి ఎంజీఎం క్రీడామైదానాన్ని అధికారులు ఎంపిక చేశారు. 40షాపులు మైదానంలో ఏర్పాటు చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచే షెడ్లు ఏర్పాటులో దుకాణ నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

గొప్ప చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చరిత్రలో మ రువలేని గొప్ప చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని బలిజసంఘం మండల అధ్యక్షుడు గుట్టూరు సూర్యనారాయణ అన్నారు. శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా వచ్చారు. బలిజ కులస్థులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు ప్రజల సౌకర్యార్థం తాగునీటి చెరువులు ఎన్నో కట్టించారని కొనియాడారు. గంగాధర్, రిటైర్డు హౌసింగ్ డీఈ నాగరాజు, శ్రీనివాసులు, హరీ, సూరీ పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని సజ్జగంట రంగనాథస్వామి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న రాయల విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. నాయకులు అశ్వత్థప్ప, రమణప్ప, ముద్దప్ప, రంగప్ప, లక్ష్మీనారాయణ, నవీన్, సుమిత్రరాయల్, గంగాధర్, రమదాసు పాల్గొన్నారు.